క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిజాంపట్నం: 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిజాంపట్నం, నగరం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్యామ్ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తించి, సహకరించాలని పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: 2023 – 24 విద్యా సంవత్సరానికి బాపట్ల జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశాలకు వెబ్‌సైట్ ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో చూడాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ నిజాంపట్నం కన్వీనర్ ఎస్.సుధాకరబాబు తెలిపారు. పదో తరగతి పాస్, ఆపై చదువు చదివిన ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10 నుంచి జూన్ 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐటీఐలను కూడా ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు. వివరాలకు 98494 79524 నంబరుకు లేదా గవర్నమెంట్ ఐటీఐ నిజాంపట్నం కార్యాలయ సమయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు ప్రింట్ కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్ కౌన్సిలింగ్ సమయంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు.

చెరుకుపల్లి: ఐటీఐలో ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జి.హుల్దాలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మెకానిక్ డీజిల్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తు చేసేకునేందుకు జూన్ 6వరకు గడువిచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 93986 50408, 86482 58622 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఫ్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

రేపల్లె రూరల్: ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించటంతో పాటు, రైళ్ల రాకపోకలు నిర్వహణలో సమయపాలన జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలు తక్కువ చార్జీలతో ప్యాసింజర్ రైళ్లలోనే ప్రయాణాలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్యాసింజర్ రైళ్లు లేకుండా చేశారన్నారు. సాధారణ ప్యాసింజర్ రైళ్లను సైతం ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చి అధిక చార్జీలు వసూళ్లకు పాల్పడటం తగదన్నారు.

కుటుంబ కలహాలపై కేసు నమోదు

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటికి తాళం వేయడంపై కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ శివారు వైవీఆర్ కాలనీలో పిల్లి అబ్రహం కుటుంబానికి ఇల్లు ఉంది. ప్రస్తుతం అది అద్దెకు ఇవ్వగా, అబ్రహం కుమారుడు సుధాకర్ అద్దె వసూలు చేస్తున్నాడు. గురువారం అబ్రహం, అతని కుమార్తె సుధారాణి ఆ ఇంటికి తాళం వేశారు. ఈ విషయమై గతంలోనూ వారి మధ్య వివాదం నడువగా.. స్పందనలో అర్జీ పెట్టుకున్నారు, సుధాకర్ ఫిర్యాదుపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్ : వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మోరిస్‌పేటకు చెందిన 35 ఏళ్ల వివాహిత పోతార్లంక రమాదేవి ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

దైవ సేవకుడు జీవరత్నం మృతి



తెనాలి: దైవ సేవకుడు ఆలపాటి జీవరత్నం (74) గురువారం తెల్లవారుజామున ఆర్ఆర్ నగర్‌లోని నివాసంలో గుండె పోటుతో మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయనకు తెనాలి, విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. రెండు రోజుల క్రితం డిశ్చార్జ్ అయ్యారు. రాత్రి నిద్రపోయిన జీవరత్నం, తెల్లవారుజామున గుండెపోటు రావటంతో నిద్రలోనే కన్నుమూశారు. సంగం డెయిరీలో బాయిలర్ సెక్షన్ ఇన్‌చార్జిగా చేసిన జీవరత్నం, తర్వాతి కాలంలో దైవ సేవకుడిగా కాలం గడిపారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జీవరత్నం భౌతికకాయాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు.

వేసవి శిక్షణ శిబిరం

తెనాలిరూరల్: ఏషియన్ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలోని యువ క్రికెట్ అకాడమీ సహకారంతో వివిధ క్రీడల సమ్మర్ క్యాంప్ గురువారం ప్రారంభమైంది. క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో 40 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జి మాలిక్ తెలిపారు. ముఖ్య అతిథులుగా అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, రేపల్లె విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ క్యాంప్‌ను ప్రారంభించారు. రిజ్వాన, మానస, శివ, గణేష్ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

రేపల్లె రూరల్: పట్టణంలోని రైలు పేటలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయం హనుమజ్జయంతి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఈ నెల 14 ఆలయ 67వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. 14న హనుమత్ వ్రతం, హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న హనుమత్ కల్యాణం, 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు, భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వహకులు తెలిపారు. అదేవిధంగా పేటేరు రహదారిలోని ఆంజనేయస్వామి ఆలయం, నల్లూరుపాలెంలో, నెల్లూరివారిపాలెం, బొందలగరువు తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఆలయాలను సిద్ధం చేస్తున్నారు.

14న హనుమజ్జయంతి

భట్టిప్రోలు: వెంకటేశ్వర భజన సమాజం ఆధ్వర్యంలో భట్టిప్రోలు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆత్మూరి మురళీ సూర్య ప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆకు పూజ, ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

గాజులపేట(భట్టిప్రోలు): పెద పులివర్రు పంచాయతీ పరిధిలోని గాజుల పేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం, పీఠంలో ధాతు స్థాపన, రత్నన్యాసం, యంత్రస్థాపన నిర్వహించారు. ఉదయం విమాన శిఖర అభయాంజనేయస్వామి విగ్రహ కళావాహన, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న దంపతులకు వేద బ్రాహ్మణుల మహదాశీర్వచనం అందించారు. స్వామివారిని బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు దర్శించుకున్నారు.



గాజులపేటలో ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి విగ్రహం



చిలుమూరులో ప్రతిష్ఠించిన ఆంజనేయుని విగ్రహం



లక్ష్మీ నరసింహాచార్యులకు సన్మానం చేసిన భక్తులు

హనుమజ్జయంతి ఉత్సవాలు

జంపని(వేమూరు): రామ గాథను ప్రచారం చేయడం వల్ల అనంతమైన లోక కల్యాణం సిద్ధిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచార కర్త దీవి లక్ష్మీ నరసింహచార్యులు పేర్కొన్నారు. జంపని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. పెనుమూళ్ల వెంకట సుబ్బయ్య, రామయ్య దంపతులు ఆచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసమూర్తి, గండపనేని నంద కిషోర్, కిలారి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

కొల్లూరు: వీరాంజనేయుని నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం చిలుమూరు ఉభయ రామలింగేశ్వర క్షేత్రం వద్ద పండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అన్నదానం చేశారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, మధుసూదన్

బాపట్ల అర్బన్: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో సచివాలయ సిబ్బందికి సుస్థిర లక్ష్యాలపై శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలకు చెందిన వంద మంది సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, సంక్షేమ, విద్యా, ఇంజినీరింగ్ సహాయకులు, మహిళా పోలీసులకు రెండు బ్యాచ్‌లుగా తరగతులు నిర్వహించారు. ఈ నెల 10,12 వరకు మొదటి బ్యాచ్‌కు, 11, 13 తేదీల్లో రెండవ బ్యాచ్‌కు శిక్షణనిస్తున్నారు. కన్సల్టెంట్ మధుసూదన్, బోధన సిబ్బంది కె.లలిత, కె.శ్రీనివాసరావు, జె.సదాశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

కర్లపాలెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జేబీ శ్రీధర్ కోరారు. కర్లపాలెంలో గురువారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ అందజేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై త్వరలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, గౌరవ అధ్యక్షుడు పఠాన్ జలీల్‌ఖాన్, భవన నిర్మాణ కార్మికుల సంఘం కర్లపాలెం మండలాధ్యక్షుడు పిట్టు కాసులరెడ్డి, కార్మికులు శ్రీనివాసరెడ్డి, మస్తాన్, జిలానీ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చెరుకుపల్లి: గుర్తుతెలియని వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని సంత బజారులో బుధవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి వివరాల మేరకు.. చెరుకుపల్లి సంత బజారులో సుమారు 30ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. వీఆర్వో నాగరాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే మృతుడు కొన్ని రోజులుగా మతి స్థిమితం లేకుండా చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతున్నాడని, ఆహారం లేక ఆరోగ్యం క్షీణించి గానీ, మరేతర కారణాల వల్ల అయినా.. చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు తెలుగులో మాట్లాడేవాడు కాదని, వంటిపై బ్లూ జీన్ ఫ్యాంట్, టీ షర్టు ఉన్నట్లు వివరించారు. ఆచూకి తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో 94409 00874 నంబరుకు సంప్రదించాలన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రేపల్లె: పట్టణంలోని 1వ వార్డు ఎస్టీ కాలనీ శ్రీరామ్‌నగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జలాధివాస, ధాన్యాధివాస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9.24గంటలకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

లిఫ్ట్ ఇచ్చి.. చైన్ స్నాచింగ్

సుద్దపల్లి(చేబ్రోలు): గుర్తుతెలియని యువకుడు బైక్‌పై వచ్చి.. మహిళను బెదిరించి, బంగారు గొలుసు అపహరించిన ఘటన సుద్దపల్లి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. సుద్దపల్లి గ్రామానికి చెందిన పోతురాజు సాంబ్రాజ్యం మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీలో ఉద్యోగినిగా పనిచేస్తోంది. డెయిరీ నుంచి ఇంటికెళ్లేందుకు బుధవారం రాత్రి వడ్లమూడి క్వారీ దేవాలయం సమీపంలోని రోడ్డు వద్ద నిలబడింది. గ్రామంలోకి వెళ్తున్నానని చెప్పిన గుర్తుతెలియని యువకుడు..ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. రైల్వే గేట్ సమీపంలో బైక్ ఆపి ఆమెను బెదిరించి, మెడలో ఉన్న సుమారు రూ.1.40లక్షల విలువ చేసే నాలుగున్నర సవర్ల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. పోతురాజు సాంబ్రాజ్యం ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాంబాబు



సచివాలయం సందర్శించిన ఎంపీడీవో సునీత

కర్లపాలెం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ డి.రాంబాబు పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ బుద్ధాం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సంక్షేమ పథకాలకు సంబందించిన లబ్ధిదారుల జాబితాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులన్నీ తాజా పరచుకోవాలని ఆదేశించారు. సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రజలకు సక్రమంగా సమాదానాలు చెప్పాలని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.పద్మావతి, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

గ్రామ సచివాలయం సందర్శన

చావలి(వేమూరు): గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్‌చార్జీ ఎంపీడీవో సునీత తెలిపారు. చావలి గ్రామ సచివాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. మండల ప్రత్యేకాధికారి రాజవర్ధన్ బలిజేపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సింధూ, గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5న ప్రభుత్వ కళాశాల భూముల కౌలు వేలం

చేబ్రోలు: చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వ్యవసాయ భూములకు హై కోర్టు ఉత్తర్వుల మేరకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13.55 ఎకరాల మాగాణి, మెట్ట భూమికి జూన్ 5 మధ్యాహ్నం 2.30 గంటలకు కమిటీ ఆధ్వర్యంలో కౌలు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. మంచాల గ్రామంలోని సర్వే నంబరు 106లోని 2.11 ఎకరాలు, చేబ్రోలు సర్వే నెంబరు 916, 235, 909/2, 426/2, 760/3లోని 11.44 ఎకరాలకు కౌలు వేలం స్థానిక కళాశాలలో జరుగుతుందన్నారు. కళాశాల కార్యాలయంలో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చునని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలులో గురువారం జరిగింది. వివరాల మేరకు.. చేబ్రోలు ప్రాంతానికి చెందిన వి.బసవపున్నయ్య బైక్‌పై వస్తుండగా సినిమా హాలు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. బసవపున్నయ్య కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 2వ లైనులో నివసించే సునీల్ చంద్రయ్యనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వెళుతుంటాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న ఇంట్లోని బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బుధవారం తన పుట్టిన రోజు అని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను ఇంటి సమీపంలో వదిలిపెట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తారకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

బాపట్ల అర్బన్: సూర్యలంక తీరంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో తారకేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గోలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ అవధాని పర్యవేక్షణలో గవ్యాంత పూజలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతి కలశ స్నపనం, ప్రసాధాన్యాసం, సాయంత్రం గణపతి, నవగ్రహ, చండీ, రుద్రహోమం, మంత్రపుష్పం విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దాతలు మంతెన దశరథమహా రాజు, మంతెన సత్యనారాయణ, దెందుకూరి సత్యవతి, బైర్రాజు నందిని, పెనుమెత్స నాగరాజు, డాక్టర్ అడ్డగడ సుబ్బారావు, మంతెన రామకృష్ణం రాజు, డాక్టర్ మంతెన నరసరాజు దంపతులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం..



రంగుమారిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఆర్‌సీ డీడీఏ విజయ నిర్మల

నిజాంపట్నం: అకాల వర్షాలకు తడిచిన వేరుశనగ పంట పూర్తిగా రంగుమారి పోవడం, మొలకెత్తడం జరిగిందని డీఆర్‌సీ డీడీఏ ఎం.విజయ నిర్మల తెలిపారు. పల్లపట్ల గ్రామంలో గురువారం ఆమె పర్యటించి, తడిచిన వేరుశన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రంగు మారిన, మొలకెత్తిన వేరుశనగ పంటను గమనించినట్లు తెలిపారు. ఈ నివేదికను డీఏవో, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాపట్ల డీఏఏటీ సెంటర్ సీనియర్ సైన్‌టిస్ట్ డాక్టర్ ఎంసీ ఓబయ్య, ఏఓ ఉమా మహేశ్వరి, నిజాంపట్నం ఏఓ వాగోలు బుష్ తదితరులున్నారు.

శ్రీలక్ష్మి మహాయజ్ఞం బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసారెడ్డి, అర్చకులు

తెనాలిటౌన్: దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17 వరకు అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసారెడ్డి తెలిపారు. షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజేయస్వామి ఆలయంలో గురువారం మహా యజ్ఞానానికి సంబంధించిన బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసారెడ్డి మాట్లాడుతూ మహాయజ్ఞంలో అనేక ఆశ్రమాలకు చెందిన పండితులు పాల్గొని, శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి రోజు విశేష కార్యక్రమాలతో పాటు, పలువురు పీఠాధిపతుల అనుగ్రహ భాషాను, ప్రవచన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు శ్రీనివాసమూర్తి, అర్చకులు కిరణ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారం



నిందితుడు పరారవుతూ వదిలివెళ్లిన ఆటో

- ఆటోను పొలాల్లోకి మళ్లించి ఘాతుకం
- ప్రతిఘటించిన మహిళను దారుణంగా కొట్టి చిత్రహింసలకు గురిచేత

కొల్లూరు: గమ్యస్థానానికి చేరేందుకు ఆటో ఎక్కిన మహిళపై ఆటోడ్రైవర్ పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి బాపట్ల జిల్లా కొల్లూరు మండలం మొసలిపాడు వద్ద పంట పొలాల్లో చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ టైలరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. గురువారం సాయంత్రం టైలరింగ్ పనికి అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేసేందుకు చిలకలూరిపేటకు వెళ్లి బస్సులో రాత్రి 9.20 ప్రాంతంలో తెనాలి చేరుకుంది. తెనాలి నుంచి తన గ్రామానికి వెళ్లేందుకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో తెనాలి మార్కెట్ వంతెన వద్ద ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితురాలు తను గతంలో నివాసం ఉన్న ప్రాంతానికి చెందిన తెలిసిన యువకునికి ఫోన్ చేసి ఆటోలో వస్తున్నట్లు సమాచారం అందించడంతో, ఆ యువకుడు ఆటో డ్రైవర్‌తో మాట్లాడి ఆటో నంబర్ చెప్పాలని కోరడంతో తాను నడుపుతున్న ఆటోకి సంబంధం లేని వేరొక నంబర్ చెప్పాడు. అనంతరం ఫోన్ కట్ చేయకుండా లైన్‌లోనే ఉంచి ప్రయాణం కొనసాగించింది. ఫోన్ కట్ చేయకుండా లైన్‌లో ఉంచడంతో అనుమానం వచ్చిన యువకుడు మధ్యమధ్యలో ఫోన్ వింటూ ఉన్నాడు. అర్ధగంట దాటిన అనంతరం మహిళ పెద్దపెద్దగా కేకలు వేస్తూ వదుల మని అరుస్తుండటంతో అనుమానం వచ్చిన యువకుడు హుటాహుటిన తమ గృహం వద్ద ఉండే యువకులతో కలసి ద్విచక్ర వాహనాలపై మహిళను వెతుక్కుంటూ వెళ్లాడు. మండలంలోని త్రాప, రావికంపాడు అడ్డరోడ్ల తోపాటు, వేమూరు వైపు వెతుకులాడుతు వెళ్లారు. మొసలిపాడు వద్ద తెనాలి-రేపల్లె రహదారి వెంట మొక్కజొన్న పొలాల్లోకి వెళ్లే దారిలో ఆటో నిలిపి ఉండటంతో అనుమానం వచ్చిన యువకులు పొలాల్లోకి వెళ్లడంతో అత్యాచారానికి పాల్పడిన యువకుడు మహిళను వదిలి పొలాల్లో పరారయ్యాడు. ఆటోను పొలాల్లోకి తిప్పడంతో భయకంపితురాలైన మహిళ పెద్దపెట్టున అరుస్తూ అతని భారినుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో మహిళను ఆటోడ్రైవర్ అత్యంత దారుణంగా కొట్టి చిత్రహింసలకు గురిచేశాడు. మహిళ అరుస్తుండటంతో ఆమె అరవకుండా నోరు మూసి మొహంపై దాడి చేసి నిస్సహాయురాలైన మహిళపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. మహిళను కాపాడటానికి వెళ్లిన యువకుల రాకను గమనించిన ఆటోడ్రైవర్ బాధితురాలిని వదిలి పరారయ్యాడు. మహిళను కాపాడేందుకు వెళ్లిన యువకుల సమాచారంతో కొల్లూరు ఎస్ఐ రాజీవ్ శామ్యూల్ కుమార్ సిబ్బందితో కలసి ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలిని పోలీసు స్టేషన్‌కు తరలించిన ఎస్ఐ ఆమె వద్ద ఫిర్యాదు తీసుకుని, వైద్య పరీక్షల నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు తెలిపారు. బాధితురాలినుంచి రూ.35వేల నగదు, బంగారు ఆభరణాలను నిందితుడు దోచుకెళ్లినట్లు సమాచారం.

సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ పుస్తకం ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి రాసిన 'సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్' పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య పి రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయి లో ప్రయోజనకరమైన పుస్తకాన్ని ఏఎన్‌యూ అధ్యాపకుడు రాయడం అభినందనీయమన్నారు. రచయి త శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గేట్, ఐఈఎస్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. సులభరతమైన అంశాలతో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. బీఎస్ పబ్లికేషన్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం తాను ఇప్పటికే ఆరు పుస్తకాలు, రెండు వ్యక్తిత్వ వికాస కథా సంకలనాలు రాశానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ర్యాకింగ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్. నాగకిశోర్, సీఈ నరసారెడ్డి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, యూఈ కుమార్ రాజు, డీఈ అప్పారావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి..

పెదకాకాని: ఉపాధి కూలీలకు గతేడాది రూ.12,88,686ల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. కొప్పురావూరు గ్రామంలో గురువారం ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈమని అప్పారావు మాట్లాడుతూ.. పనిచేసిన వారికి సకాలంలో వేతనాలు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని అధికారులను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. లేకపోతే మే 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ



పెదకాకాని: ఇంటికి గేటు వేసి ఉండటాన్ని గుర్తించి, తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన వెంకటకృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన కంచర్ల నాగేశ్వరరావు వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 9న బనగానపల్లె వెళ్లాడు. ఇంటికి తలుపులు వేసి ఉండటాన్ని కనిపెట్టిన గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి, సుమారు 10 సవర్ల బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలు, లక్ష రూపాయలు నగదు దోచుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు ఇంటికి చేరుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది.